పకడ్బందీగా 'పది' సప్లిమెంటరీ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ఎస్వీ నాగేశ్వరావు

కర్నూలు(సెంట్రల్): పదో తరగతి అడ్వాన్సుడు సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరావు విద్యా శాఖాధికారులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో జిల్లా అధికారుల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను విధించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, క్యాలికులేటర్లు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో మంచినీరు, నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. డీఈఓ రంగారెడ్డి మాట్లాడుతూ..పదో తరగతి అడ్వాన్సుడు పరీక్షల నిర్వహణ కోసం 61మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు ఫ్లైయింగ్ స్క్వాడులు, 610 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు చెప్పారు. అలాగే పరీక్ష పేపర్లను భద్రపరచడం కోసం 27 స్టోరేజ్ పాయింట్లను గుర్తించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏసీ చంద్రభూషణంతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలకు వేళాయే!

- జిల్లాలో 61 కేంద్రాల ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న విద్యార్థులు 33,287 మంది
- నామ మాత్రంగా ప్రత్యేక తరగతులు

కర్నూలు సిటీ: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు పరీక్షల విభాగం సిద్ధమవుతోంది. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో జరిగిన పబ్లిక్ పరీక్షలకు 28,786 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు అయ్యారు. వీరిలో 11,347 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వీరికి జూన్ 2 నుంచి10వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల కోసం జిల్లాలో 61 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫెయిల్ అయిన విద్యార్థులతో పాటు మార్కులు తక్కువ వచ్చిన వారు సైతం మార్కులు పెంచుకునేందుకు ఫీజులు చెల్లించారు. వీరి హాల్‌టికెట్లను ప్రభుత్వ పరీక్షల విభాగం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. వివిధ సబ్జెక్టులతో కలిపి మొత్తం 33,287 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకు పరీక్షల విభాగం అధికారులు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువ శాతం మంది విద్యార్థులు గణితం సబ్జెక్టులోనే ఫెయిల్ అయ్యారు. గతేడాది కంటే ఉత్తీర్ణత శాతం పెంచాలనే ఉద్దేశంతోనే విద్యాశాఖ రాష్ట్ర వ్యాప్తంగా హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లను డిప్యూటేషన్‌పై కేటాయించింది. అయినా గణితం సబ్జెక్టులో ఎక్కువ మంది ఫెయిల్ అయ్యారు. సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఆయా స్కూళ్ల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులందరినీ ఉత్తీర్ణులు చేసే బాధ్యత ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు తీసుకుని, రెమిడియల్ క్లాసులు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశించింది. ఏపీ మోడల్ స్కూల్స్, కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో హాస్టల్స్ ఉండడంతో రెమిడియల్ తరగతులు కొంత మేరకు నిర్వహించారు. ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ హైస్కూళ్లలో రెమిడియల్ తరగతులు నామమాత్రంగానే నిర్వహించారు. డీఈఓ, డిప్యూటీ డీఈఓల పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.



ఖాదర్‌లింగ స్వామి ఉరుసు ప్రారంభం



స్వామి వారి సమాధి వద్ద ప్రత్యేక ఫాతెహాలు చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో జగద్గురు ఖాదర్‌లింగ స్వామి ఉరుసు బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. ప్రత్యేక ఫాతేహాల అనంతరం స్వామి సమాధిని సుగంధ ద్రవ్యాలు, పానీయాలతో శుభ్రం చేశారు. దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్తీ, పీఠాధిపతి సయ్యద్ ఖాదర్ బాష చిష్తీలు వారి శిష్యరిక బృందం ప్రత్యేకంగా తెచ్చిన చద్దర్‌ను స్వామి సమాధిపై వేసి పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, ఫాతేహాలు నిర్వహించి నగారా వాయించారు. దీంతో ఉరుసు ప్రారంభం అయినట్లు ధర్మకర్త తెలిపారు. కార్యక్రమంలో గుల్షన్ కమిటీ అధ్యక్షుడు మున్నపాష, ప్రతభ పాఠశాల కరస్పాండెంట్ దూద్‌బాషా గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో పలువురికి స్థానచలనం

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ)లో పలువురు కింది ఉద్యోగులకు స్థాన చలనం కలిగింది. నిబంధనల ప్రకారం సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగుల్లో మ్యూచువల్, మెడికల్ కేటగిరీల్లో పలువురు డ్రైవర్లు, కండక్టర్లకు బదిలీ చేస్తూ కర్నూలు జిల్లాధికారి (ఆర్ఎం) వెంకటరామం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పెద్దాసుపత్రిలో ఎన్ఎంసీ బృందం తనిఖీ



మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌తో ఎన్ఎంసీ బృంద సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కర్నూలు మెడికల్ కాలేజీల్లో బుధవారం నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) బృంద సభ్యులు తనిఖీలు నిర్వహించారు. బృందంలో డాక్టర్ ఆర్ఎన్. మండల్(ఫరీదాబాద్), డాక్టర్ వెంకటేష్ మదన్(చెన్నై), డాక్టర్ ఎం. యోగాంబల్(చెన్నై) ఉన్నారు. వీరు పాథాలజీ విభాగం, పీడియాట్రిక్స్, సైకియాట్రీ విభాగాలను పరిశీలించారు. ఇటీవల పాథాలజీలో 4, పీడియాట్రిక్స్‌లో 4, సైకియాట్రీలో 3 పీజీ సీట్లు పెరిగిన నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. అనంతరం వీరు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్‌ను కలిసి వివరాలు సేకరించారు.









సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు



పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ జి.కృష్ణకాంత్

పత్తికొండటౌన్: సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. మంగళవారం స్థానిక సెయింట్‌జోసెఫ్ ఉన్నతపాఠశాలలో ఏర్పాటు చేసిన సభాప్రాంగణం వద్ద బందోబస్తుకు వచ్చిన పోలీసు సిబ్బందికి సూచనలు ఇచ్చారు. హెలిప్యాడ్, సీఎం పర్యటించే రూట్, రూఫ్–టాప్ ప్రాంతాలలో సీఎం కాన్వాయ్, బహిరంగసభ సమావేశ ప్రాంగణం ప్రాంతాలలో విధులు నిర్వహించే స్పెషల్‌పార్టీ పోలీసు బృందాలు, పోలీసు జాగిలాలు, బాంబ్‌స్క్వాడ్ బృందాలతో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు. సభకు వచ్చే ప్రజల పట్ల సున్నితంగా వ్యవహరించాలన్నారు. అనంతరం సీఎం కాన్వాయ్ రిహార్సల్స్‌ను, హెలిప్యాడ్, బహిరంగసభ వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనతో కలసి ఎస్పీ పరిశీలించారు. నలుగురు అడిషనల్ ఎస్పీలు, 19 మంది డీఎస్పీలు, 57 మంది సీఐలు, 119 మంది ఎస్‌ఐలు, 473 మంది ఏఎస్‌ఐలు, 815 మంది పోలీసులు, 70 మంది మహిళా పోలీసులు, 396 మంది హోం గార్డులు, 2 సెక్షన్ల ఏఆర్ సిబ్బంది, 2 సెక్షన్ల స్పెషల్‌పార్టీ బృందాలను సీఎం పర్యటన బందోబస్తుకు కేటాయించినట్లు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. ఎస్పీ వెంట సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఈడీగా గిడుగు వెంకటేశ్వరరావు



కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణ శాఖ(ఆర్టీసీ) కడప జోన్(కర్నూలు, కడప, అనంతపురం ఉమ్మడి జిల్లాలు) ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా గిడుగు వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న గోపినాథ్‌రెడ్డిని విజయవాడకు బదిలీ చేయగా అక్కడున్న వెంకటేశ్వరరావును ఇక్కడికి స్థాన చలనం కలిగిస్తూ సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారాకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన 2015–17 మధ్య కర్నూలు రీజినల్ మేనేజర్‌గా విధులు నిర్వహించారు. అలాగే ఎమ్మిగనూరు డిపో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.నాగభూషణంను అనంతపురం జిల్లా కమర్షియల్ విభాగం ఏటీఎంగా బదిలీ చేయగా.. అక్కడున్న బి.అమర్నాథ్‌ను ఎమ్మిగనూరుకు బదిలీ చేశారు.

నేడు పత్తికొండకు సీఎం వైఎస్ జగన్

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- 1,500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

కర్నూలు(సెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పత్తికొండకు రానున్నారు. వరుసగా ఐదో ఏడాది వైఎస్‌ఆర్ రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. బటన్ నొక్కి రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి వైఎస్‌ఆర్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని, ఇన్‌పుట్ సబ్సిడీని జమ చేయనున్నారు. సీఎం పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పత్తికొండలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల ఆవరణలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. జూనియర్ కాలేజీ ఆవరణలో హెలిప్యాడ్‌ను తాత్కాలికంగా నిర్మించారు. పత్తికొండలో సీఎం పర్యటించే ప్రాంతాల్లో రహదారులను బాగు చేశారు. నిరంతంగా విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం నాలుగు రోజుల క్రితమే సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం టూర్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ కూడా పత్తికొండలో ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు.



సిద్ధమైన సభాప్రాంగణం



సభా వేదికను పరిశీలిస్తున్న అధికారులు



ఏర్పాట్లపై కలెక్టర్‌తో చర్చిస్తున్న తలశిల రఘురాం

సీఎం పర్యటన సాగుతుంది ఇలా..

గురువారం ఉదయం 8.20 గంటలకు సీఎం ఇంటి నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 9.20 గంటలకు విమానంలో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు వస్తారు.
- 9.20 నుంచి 9.30 వరకు సీఎంతో ప్రజా ప్రతినిధులతో మాట్లాడే అవకాశం ఉంటుంది.
- 10 గంటలకు హెలికాప్టర్‌లో పత్తికొండలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10 నుంచి 10.10 గంటల మధ్య అక్కడ సీఎంకు ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలుకుతారు.
- 10.10 గంటలకు రోడ్డు మార్గన సభావేదికకు వెళ్తారు.
- 10.25 గంటలకు సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సభా వేదిక ప్రాంగణానికి సీఎం చేరుకుంటారు.
- 10.25 నుంచి 10.35 గంటల మధ్య ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం తిలకిస్తారు.
- 10.40 గంటలకు సభా వేదికపైకి సీఎం వస్తారు.
- 10.45 గంటల్లోపు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం ఉంటుంది.
- 10.45 నుంచి 10.50 గంటలకు కలెక్టర్ ప్రసంగిస్తారు.
- 10.50 నుంచి 10.55 గంటల వరకు స్థానిక ఎమ్మెల్యే మాట్లాడతారు.
- 10.55 నుంచి 11.05 గంటల మధ్య సభకు వచ్చిన మంత్రులు, ఇతరుల ప్రసంగిస్తారు.
- 11.05 గంటలకు రైతు భరోసా పెట్టుబడి నిధులపై షార్ట్ వీడియో ప్రదర్శన నిర్వహిస్తారు.
- 11.10 గంటలకు రైతు భరోసాతో లాభం పొందిన రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటారు.
- 11.15 నుంచి11.50 మధ్య సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం ఉంటుంది.
- 11.50 నుంచి 11.55 వరకు రైతు భరోసా నిధులను బటన్ నొక్కి అర్హుల జాబితాలో జమ చేస్తారు.
- 12.05 గంటలకు తిరిగి హెలిపాడ్ చేరుకుంటారు.
- 12.05 నుంచి 12.35 గంటల వరకు స్థానిక నాయకులతో మాట్లాడతారు.
- 12.40 గంటలకు హెలికాప్టర్‌లో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు.
- 01.05 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు చేరుకుంటారు.
- 01.10 గంటలకు ఓర్వకల్లు నుంచి విమానంలో గన్నవరం బయలుదేరుతారు.

విలువ పెంపు.. రైతుకు ఊరడింపు

- భూమి విలువ పెరిగితే పొందే ప్రయోజనాలే అనేకం
- అనుకోని పరిస్థితుల్లో తనఖా పెట్టినా, అమ్మినా వచ్చే రేటు ఎక్కువే
- ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం భూములను కోల్పోతే ఎక్కువ పరిహారం చెల్లిస్తారు
- మార్కెట్ విలువ పెంచినా స్టాంప్ డ్యూటీ మాత్రం పెరగదు
- జిల్లాలో భూముల కనీస మార్కెట్ రేటు రూ.1.6 లక్షలు.. అత్యధికం రూ.20 లక్షలు
- వంద గ్రామాల్లో మార్కెట్ విలువను సవరించిన రిజిస్ట్రేషన్ శాఖ
- రేపటి నుంచి కొత్త మార్కెట్ విలువ ప్రకారమే రిజిస్ట్రేషన్లు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాలో 11 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో అతి తక్కువగా కోసిగిలో ఎకరం వ్యవసాయ భూమి మార్కెట్ విలువ రూ. 1.60 లక్షలు ఉండగా, అత్యధికంగా కర్నూలు, కల్లూరుతోపాటు అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల పరిధిలోని వ్యవసాయ భూముల విలువ దాదాపు రూ. 30 లక్షల వరకు ఉంటోంది. వ్యవసాయేతర భూముల విలువ అయితే ఎకరం రూ.కోటిన్నర వరకు మార్కెట్ విలువ ఉంటోంది. ఈక్రమంలో తక్కువ మార్కెట్ విలువ ఉన్న గ్రామాల్లో సవరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎకరం రూ. 2.5 లక్షల లోపు ఉన్న భూముల విలువను పెంచారు. వంద గ్రామాల్లో 10 నుంచి 35 శాతం వరకు పెంచారు. దీంతో ఆయా గ్రామాల్లో ఎకరం మార్కెట్ విలువ మూడు లక్షల వరకు చేరి ఉంటుంది.

అసత్య ప్రచారాలు..

రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ విలువల సవరణ చేపట్టడంతో కొంత దుష్ప్రచారం జరుగుతోంది. కేవలం ప్రభుత్వం విలువ పెంచుకొని సొమ్ము చేసుకోవడానికి చూస్తోందని ఆరోపణలు చేస్తున్నారు. అయితే అందులో ఎలాంటి నిజం లేదు. మార్కెట్ విలువను పెంచడంతో రైతన్నకు ఎన్నో లాభాలు ఉన్నాయి. మార్కెట్ విలువ ఎక్కువగా ఉంటే ఆ భూమి ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం తీసుకున్నా రైతులు అధిక ప్రయోజనం పొందవచ్చు. రైతుల నుంచి ప్రభుత్వం భూమి తీసుకుంటే 2013 భూసేకరణ చట్టం ప్రకారం మూడు రెట్లు అధికంగా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలో మార్కెట్ విలువ అధికంగా ఉంటే రైతన్నకే మేలు జరుగుతుంది. ఇబ్బందుల్లో అన్నదాత బ్యాంకులో తనఖాపెట్టిన మార్కెట్ విలువ ప్రకారం రేటు చెల్లిస్తారు. అప్పుడు కూడా రైతుకు మేలే జరుగుతుంది. ఒక వేళ అమ్ముకున్నా మార్కెట్ రేటు దృష్టిలో ఉంచుకొని విక్రయించడానికి అవకాశం ఉంటుంది.

స్టాంపు డ్యూటీ పెంపు లేదు..

ఆస్తుల క్రయ, విక్రయాల ప్రక్రియలో భాగంగా స్టాంపు డ్యూటీ కింద మార్కెట్ విలువలో 7.5 శాతం మొత్తాన్ని చలానా రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో 5.5 శాతం స్టాంపు డ్యూటీ, 1.5 శాతం ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, ఒక్క శాతం రిజిస్ట్రేషన్ ఫీజు ఉంటుంది. దీనికి అదనంగా యూజర్ చార్జీని రూ.500 వసూలు చేస్తారు. అయితే భూముల మార్కెట్ విలువ పెంచినా ప్రభుత్వం మాత్రం స్టాంపు డ్యూటీని పెంచలేదు. అయితే భూముల విలువ కొంత మేరకు పెరిగితే స్టాంపు డ్యూటీ కూడా కొంత పెరుగుతుంది.

● కర్నూలు నగరానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉల్చాలలో ఎకరా విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఉంది. అయితే మార్కెట్ విలువ మాత్రం రూ. 4 లక్షలు మాత్రమే ఉంది. ఇటీవల ఆ గ్రామానికి చెందిన రైతుల పొలాలు చెన్నై – సూరత్ జాతీయ రహదారి కోసం ప్రభుత్వం సేకరించింది. మార్కెట్ విలువ ప్రకారం రెండు రెట్లు అదనంగా ఇచ్చినా రూ. 12.50 లక్షలు మాత్రమే ఇచ్చింది. అయితే రైతులు ఇది చాలా తక్కువ పరిహారమని, తమ పొలాలు బహిరంగ మార్కెట్‌లో కోట్లలో విలువ చేస్తాయని వాదించినా ఏమి చేయలేని పరిస్థితి. అదే అక్కడ మార్కెట్ విలువ ఎక్కువగా ఉంటే వారికి ఎక్కువ పరిహారం వచ్చేది.

● మార్కెట్ విలువ ఎక్కువగా ఉంటే రైతులు పొందే పరిహారాలు ఎక్కువగా ఉంటాయి. తక్కువగా ఉంటే ప్రస్తుత పరిస్థితుల్లో అన్నదాతలు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకొని మార్కెట్ విలువ తక్కువగా ఉన్న గ్రామాల్లో సవరణ చేసింది. జిల్లాలో దాదాపు 100 గ్రామాల్లో మార్కెట్ విలువను 10 నుంచి 35 శాతం పెంచారు.



జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం

నేటి నుంచి పెరిగిన మార్కెట్ విలువ ప్రకారమే రిజిస్ట్రేషన్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి పెరిగిన మార్కెట్ విలువల ప్రకారమే సబ్ రిజిస్ట్రార్లు విక్రయ దరఖాస్తులను పూర్తి చేస్తారు. కర్నూలు జిల్లాలో 100 గ్రామాల్లో మార్కెట్ విలువను పెంచారు. పెంచిన విలువలను ఆన్‌లైన్ ప్రక్రియలో నమోదు చేశారు. ఇందుకోసం జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని ప్రజలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగమయ్యే ప్రజలు గమనించాలని అధికారులు కోరుతున్నారు.

పెరిగిన విలువతోనే రిజిస్ట్రేషన్‌లు



జూన్ 1 నుంచి పెరిగిన మార్కెట్ విలువ ప్రకారమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ నడుస్తుంది. ఇప్పటికే జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తెలిపింది. ప్రజలు గమనించాలని కోరుతున్నాం. స్టాంపుడ్యూటీ మాత్రం పెరగలేదు. భూమి విలువ పెరిగితే రైతన్నకే అన్ని రకాలుగా మేలు జరుగుతుంది.

– నాగలింగేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రార్, కర్నూలు





మునగాలపాడు పంప్ హౌస్ వద్ద నిర్మించిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నగర మేయర్, కర్నూలు, నంద్యాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నిడ్జూరు వద్ద పైపులైన్ పనులను పరిశీలిస్తున్న మేయర్, ఎమ్మెల్యేలు

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- నగర మేయర్ బివై.రామయ్య
- రూ.15.10 కోట్లతో నిర్మించిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ప్రారంభం
- హాజరైన కర్నూలు, నంద్యాల ఎంపీలు, కర్నూలు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు





ఫిల్టర్ బెడ్ పనితీరును పరిశీలిస్తున్న మేయర్ రామయ్య, కర్నూలు, నంద్యాల ఎంపీలు సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, రాంభూపాల్‌రెడ్డి, సుధాకర్, కార్పొరేటర్లు

కర్నూలు (టౌన్): తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకున్నట్లు నగర మేయర్ బీవై రామయ్య తెలిపారు. గురువారం స్థానిక మునగాలపాడు పంప్ హౌస్ వద్ద రూ.15.10 కోట్లతో నిర్మించిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను కర్నూలు, నంద్యాల ఎంపీలు డాక్టర్ సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ జరదొడ్డి సుధాకర్, కమిషనర్ భార్గవ్‌తేజలతో కలిసి నగర మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాలంలోనే నగర వాసుల దప్పిక తీర్చేందుకు రూ.225 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఎంపీలు సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డిలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను నగరపాలక సంస్థ సమర్థవంతంగా వినియోగించుకుంటుందని కొనియాడారు. కర్నూలు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, డాక్టర్ జరదొడ్డి సుధాకర్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వం కర్నూలు నగరాన్ని పూర్తిగా విస్మరించడంతో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. వైఎస్ జగన్ సర్కార్ కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించి అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తోందన్నారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ నగరవాసుల తాగునీటి సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్లాంట్ పనులను పూర్తి చేశామన్నారు. సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు రూ.82 కోట్లతో నిర్మిస్తున్న పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మరో నాలుగు నెలల్లో వాటిని ప్రారంభిస్తామన్నారు.

నంద్యాల ఎంపీ ల్యాడ్స్ నిధులతో..

నంద్యాల ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ. 37.5 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన జేసీబీని పూజలతో ప్రారంభించారు. అనంతరం సుంకేసుల జలాశయం పరిశీలించారు. నీటి నిల్వల గురించి ఆరా తీశారు. అలాగే సుంకేసుల మునగాలపాడు పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఎకరన్నర స్థలంలో నిర్మించిన నీటి శుద్ధి కేంద్రం, ఆలమ్ ట్యాంకు, రసాయన హౌస్, బైపాస్ చానల్, ఏరేటర్‌లను అతిథులు ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, స్టాండింగ్ కమిటీ సభ్యులు వై.అరుణ, సాన శ్రీనివాసులు, మల్లికా బేగం, కార్పొరేటర్లు షాషావలీ, ఆర్షియా ఫర్హీన్, నీలోఫర్, జుబేర్, యూనుసు, ఫరాజ్‌ఖాన్, క్రాంతి కుమార్, విజయలక్ష్మి, కైపా పద్మలతారెడ్డి, గాజుల శ్వేతారెడ్డి, సిట్రా సత్యనారయణమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మిద్దె చిట్టెమ్మ, సాంబశివరావు, విక్రమసింహారెడ్డి, మునెమ్మ, శ్రీనివాసరావు, క్రిష్ణకాంతారెడ్డి, అహ్మద్ హుస్సేన్, ఎస్‌ఈ వేణుగోపాల్, పబ్లిక్ హెల్త్ ఈఈ చంద్రమోహన్, ఎంఈలు శేషసాయి, షాకీర్ హుస్సేన్, డీఈఈ రవిప్రకాష్ నాయుడు, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

అమ్మా చనిపోతున్నా.. నా పిల్లలు జాగ్రత్త!



హుసేన్ పీరా (ఫైల్)

ఆదోని సెంట్రల్: మండల పరిధిలోని పెద్ద తుంబళం గ్రామానికి చెందిన ఖాసీం పీరా(32) రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు ముందు తీసుకున్న సెల్ఫీ వీడియోలో ''అమ్మా చనిపోతున్నా.. నా పిల్లలు జాగ్రత్త' అని చెప్పడం అందరినీ కలచి వేసింది. మృతుడు గతంలో పెద్దతుంబళం ఎస్‌ఐ జీపు డ్రైవర్‌గా పనిచేశాడు. ప్రస్తుతం జీపు డ్రైవర్‌గా హోంగార్డును నియమించడంతో ఆరు నెలల నుంచి ఖాళీగా ఉంటున్నాడు. ఇతని భార్య ఖాజీబీ అలియాస్ ఫాతిమా అంగనవాడీ అయాగా పని చేస్తోంది. వీరి కుమార్తె అఫ్రీన్ ఐదో తరగతి, కుమారుడు అబ్బాస్ నాలుగో తరగతి చదువుతున్నారు. తీవ్రమైన కడుపునొప్పి భరించలేక జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామస్వామి తెలిపారు.

ఖరీఫ్‌కు 'అన్నీ మంచి శకునములే'

నేటి నుంచి సీజన్ ప్రారంభం

- సకాలంలో కురుస్తున్న వర్షాలు
- ఉత్సాహంగా సాగుకు సిద్ధమైన రైతులు
- పత్తి, మిరప, వేరుశనగపైనే దృష్టి
- ఉద్యమ తరహాలో చిరుధాన్యాల సాగు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయానికి ప్రభుత్వం అన్నివిధాల తోడ్పాటును అందిస్తోంది. ఇదే సమయంలో ప్రకృతి కూడా సహకరిస్తోంది. 2019–20 నుంచి 2022–23 వరకు అన్నదాతకు వ్యవసాయం కలసి రాగా.. 2023–24 సీజన్‌లోనూ వ్యవసాయం పండగను తలపించనుంది. మిరపకు రికార్డుస్థాయి ధరలు లభించడం, మిగిలిన పంటలకు కూడా ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఏరువాకకు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు 'అన్నీ మంచి శకునములే' ఉండటం విశేషం. ఈ ఏడాది కూడా వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండటం పట్ల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం వ్యవసాయం దండగ అని నిర్లక్ష్యం చేయగా.. వైఎస్ ఆర్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగ చేసి చూపుతోంది. ఇక వైఎస్‌ఆర్ రైతు భరోసా కింద 5వ ఏడాదికి సంబంధించి మొదటి విడతలో జిల్లాలో 2,83,308 రైతు కుటుంబాలకు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన మొదటి రోజునే విడుదల చేస్తోంది.

జిల్లాలో ప్రధాన పంట పత్తే..

ఈ సారి మిరప, వేరుశనగ ధరలు జోరుమీద ఉండటంతో రైతులు ఈ పంటల సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ విత్తనాలకు మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది. జిల్లాలో సాగు చేసే పంటల్లో పత్తి ప్రధానమైంది. 2,44,695.8 హెక్టార్లలో సాగయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాకు దాదాపు 13 లక్షల ప్యాకెట్ల బీటీ పత్తి విత్తనాలు అవసరమని అంచనా. బీటీ–2 పత్తి విత్తనాలు 450 గ్రాముల ప్యాకెట్ ధర రూ.853 ఉండగా.. ఒకటి, రెండు వెరైటీలకు మాత్రమే మార్కెట్‌లో డిమాండ్ ఉంటోంది. వీటిని రూ.1000 నుంచి రూ.1100 వరకు విక్రయిస్తున్నారు. పత్తి సహా అన్ని రకాల విత్తనాలపై అనుమానం వస్తే నియోజక వర్గాల వారీగా వైఎస్‌ఆర్ అగ్రి ల్యాబ్‌ల్లో ఉచితంగా పరీక్షించుకునే వీలు కల్పించారు.

సాగుకు సన్నద్ధం



ముత్తుకూరు సమీపంలో పొలాన్ని చదును చేస్తున్న రైతు

ఖరీఫ్ సీజన్‌కు రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు. తొలకరి వర్షాలు కురుస్తుండడంతో పొలాలను చదును చేసుకుంటున్నారు. మండలంలో రెండు రోజుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో పత్తి విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యారు. మండలంలో పత్తి 14వేల హెక్టార్లు, వేరుశెనగ 1200 ఎకరాలు, సజ్జ 2,00 ఎకరాలు, కొర్ర 1100 ఎకరాలు, కంది 2,350 ఎకరాల్లో సాగవుతుందని ఏఓ మునెమ్మ తెలిపారు.

– ఆస్పరి

విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం

ఖరీఫ్ సీజన్ సాధారణ వర్షపాతం 401.1 మిల్లీమీటర్లు. ఈ సారి కూడా సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రుతుపవనాలు త్వరలోనే విస్తరించే అవకాశం ఉంది. నైరుతి రుతపవనాల ఆగమనాన్ని బట్టి చూస్తే ప్రతి నెలా సాధారణం మేర వర్షాలు కురిసే అవకాశం కనిపిస్తోంది. మే నెలలో వర్షాలు విస్తారంగా పడటంతో ఇప్పటికే రైతులు భూములను సిద్ధం చేసుకున్నారు.

రసాయ ఎరువులు పుష్కలం

కొన్నేళ్లుగా ఎరువులకు ఎలాంటి కొరత ఉండటం లేదు. నానో యూరియాతో పాటు నానో డీఏపీ (ద్రవరూపం) అందుబాటులోకి రావడంతో రైతులపై ఎరువుల ఖర్చు తగ్గే అవకాశం ఏర్పడింది. రైతులకు ఇబ్బంది లేకుండా ఆర్‌బీకేల ద్వారా అవసరమైన అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచారు. 1,99,926 టన్నులు అవసరం కాగా.. ఇప్పటికే మార్క్‌ఫెడ్ కంపెనీ గోదాములు, ప్రైవేటు డీలర్ల వద్ద దాదాపు 71,688 టన్నుల ఎరువులు ఉన్నాయి. జిల్లాలోని ఆర్‌బీకేల ద్వారా 59,207 టన్నుల ఎరువులను రైతులకు పంపిణీ చేయాలనేది లక్ష్యం.

ముందస్తుగా వేరుశనగ పంపిణీ

గతంలో ఎప్పుడూ లేని విధంగా రైతులకు ఖరీఫ్ ఆరంభానికి ముందే విత్తనాలు పంపిణీ చేస్తుండటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వేరుశనగ ప్రధానంగా సాగు చేసే మండలాలైన వెల్దుర్తి, క్రిష్ణగిరి, మద్దికెర, తుగ్గలి, దేవనకొండ, పత్తికొండ, కోడుమూరు, ఆలూరు, ఆదోని, పెద్దకడుబూరు తదితర మండలాల్లో వేరుశనగ పంపిణీ చురుగ్గా సాగుతోంది. జిల్లాకు 15,905 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించారు. రైతులు నాన్ సబ్సిడీ మొత్తం చెల్లిస్తే అక్కడికక్కడే అర్హత మేరకు వేరుశనగ 30 కిలోల బ్యాగులు పంపిణీ చేస్తున్నారు.

ఆర్‌బీకేలతో రైతులకు మేలు



జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడటంతో రైతులు ఉత్సాహంగా వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. రైతు భరోసా కేంద్రాలను రైతులకు పూర్తిగా అందుబాటులోకి తెచ్చాం. అన్ని రకాల సేవలు వీటి ద్వారానే అందుతాయి. ఇప్పటికే వేరుశనగ విత్తనాల పంపిణీ చురుగ్గా జరుగుతోంది. రైతులు లైసెన్స్ కలిగిన డీలరు వద్ద ధ్రువీకరించిన విత్తనాలనే కొనుగోలు చేయాలి.

– పీఎల్ వరలక్ష్మి, డీఏఓ, కర్నూలు

మాట నిలబెట్టుకున్న నేత జగనన్న


వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు చేసి నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: దేశంలో ఏ ఒక్కరూ చేయని విధంగా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి, మాట నిలబెట్టుకున్న నేత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరేనని దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి అన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగ బుధవారం హొళగుందలో సంబరాలు చేసుకున్నారు. ముందుగా వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశ, రాష్ట్ర చరిత్రలో ఏ నేత అమలు చేయని సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తోక వెంకటేష్ నిర్వహిస్తున్న ఉలిగమ్మ దేవర కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు షఫివుల్లా, వీరేశ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, కుమారస్వామి, సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున, కోగిలతోట శేషప్ప తదితరులు పాల్గొన్నారు.





వెల్దుర్తి మండలం శ్రోత్రియం పేరేముల రోడ్డు

పల్లె రోడ్లకు మహర్దశ

- రూ.189.11 కోట్లతో పనులు

కర్నూలు(అర్బన్): ఎలాంటి రహదారి సౌకర్యం లేని గ్రామాలకు రోడ్లను వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోంది. ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్టు (ఏపీఆర్ఆర్‌పీ) పనుల్లో భాగంగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో రూ.189.11 కోట్ల నిధులతో ఆరు ప్యాకేజిల్లో 85 పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే ఆయా నియోజకవర్గాల్లోని 95 గ్రామాలకు సమీప గ్రామాలు, జాతీయ రహదారులకు కనెక్టివిటీ లభిస్తుంది. ఇప్పటికే ఈ పనుల్లో 18 పనులు పూర్తి కాగా, 66 పనులు పురోగతిలో ఉన్నాయి. ఆలూరు నియోజకవర్గంలో 44 పనులు చేపట్టగా, పత్తికొండ నియోజకవర్గంలో 21 పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు సంబంధించి మొత్తం 190.11 కిలోమీటర్ల మేర కొత్తగా రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఇందులో ఇప్పటి వరకు రూ.42.58 కోట్లు వెచ్చించి 17.94 కిలోమీటర్ల మేర బీటీ, 25.01 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల పనులు పూర్తయ్యాయి. అలాగే పీఎంజీఎస్‌వై – 3 కింద రూ.32.01 కోట్లతో మంజూరైన 8 రోడ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. పీఎంజీఎస్‌వై ఇన్సెంటివ్ గ్రాంట్ కింద రూ.3.67 కోట్లతో ఆరు రోడ్ల పనులను చేపట్టగా, ఇప్పటి వరకు ఐదు పనులు పూర్తి కాగా, ఒక్క పని పురోగతిలో ఉంది. ఈ పనుల్లో భాగంగా పాట్‌హోల్ ఫ్రీ లింక్ రోడ్స్ పనులకు సంబంధించి రూ.24.45 కోట్లతో 209.30 కిలోమీటర్ల మేర 56 పనులు మంజూరయ్యాయి. ఇందులో 24 పనులు పూర్తి కాగా, 32 రోడ్లలో పనులు జరుగుతున్నాయి.


7వ నంబర్ జాతీయ రహదారికి కనెక్టివిటీగా ఏర్పాటు చేసిన గుంటుపల్లె రోడ్డు

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి


జిల్లా కలెక్టర్ సృజన, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాంతోచర్చిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 1వతేదీ గురువారం పత్తికొండ రానున్నారు. ఈ మేరకు సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశాల మేరకు వారం రోజులుగా జిల్లాస్థాయి అధికారులు పత్తికొండలోనే మకాం వేసి సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం స్థానిక సెయింట్‌జోసెఫ్ ఉన్నత పాఠశాలలోని రైతుభరోసా సభాప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు.

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పత్తికొండకు వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భారీస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. హెలిప్యాడ్ నుంచి సభాప్రాంగణం వరకు సీఎం బస్సులో వచ్చే రూట్‌లో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా భారీ ఫ్లెక్సీలు, కటౌట్‌లు ఏర్పాటు చేశారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం

కృష్ణగిరి: పత్తికొండలో గురువారం 1వ తేదీ జరిగే సీఎం సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సీఎం హోదాలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వస్తున్నారని, పత్తికొండ సభలో రైతుభరోసా సాయం రైతుల ఖాతాల్లో జమ చేస్తారన్నారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, నాయకులు, రైతులు సకాలంలో సభ ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు.

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేద్దామని వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి తమ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్థానిక వైఎస్సార్సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులకు ఖరీఫ్‌కు ముందే పెట్టుబడి సాయం అందజేసే ఈ బృహత్కర కార్యక్రమానికి అందరూ తరలిరావాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, పార్టీ పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు, ఎస్సీ సెల్, ముస్లిం మైనారిటీ మండల కన్వీనర్లు రాజు, ఆరిఫ్, సచివాలయ కన్వీనర్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

మద్దికెర : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పత్తికొండ పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్సీపీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులకు జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, పత్తికొండ మార్కెట్‌యార్డు చైర్మన్ పక్కీరప్ప పిలుపునినిచ్చారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అన్నదాతలను ఆదుకునేందుకు అమలు చేస్తున్న వైస్సార్ రైతుభరోసా పథకానికి సంబంధించి వరుసగా ఐదో ఏడాది మొదటి విడత పెట్టుబడి సాయం నగదును రైతు ఖాతాల్లో జమ చేసేందుకు ఏర్పాటు చేసిన సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

నాలుగేళ్లలో ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు

- ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి
- పట్టణంలోని 12వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

ఎమ్మిగనూరుటౌన్: నాలుగేళ్లలోనే అర్హత ఉన్న ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం పట్టణంలోని 12వ వార్డులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వార్డు పరిధిలో ప్రతి గడపలో సంక్షేమ పథకాల బుక్‌లెట్లు ఇస్తూ పొందిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీల మేరకు నవరత్నాల పథకంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు మంజూరు చేయడం జరిగిందన్నారు.


మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎర్రకోట

పార్టీలకతీతంగా ఒక్క పైసా అవినీతి లేకుండా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తుండటంతో కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నాయన్నారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో 12వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ షాబుద్దీన్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్న్ కేఎస్ రఘు, మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బుట్టారంగయ్య తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి విద్యుత్ షాక్

వెల్దుర్తి: బింగిదొడ్డి గ్రామ యువకుడు చరణ్‌రెడ్డి గురువారం విద్యుత్‌షాక్‌కు గురై గాయాల పాలయ్యాడు. ఇంట్లో నీటి పంపింగ్ మోటార్ శుభ్ర పరిచే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు వెల్దుర్తి ఆసుపత్రికి తరలించగా వైద్య సిబ్బంది లేక కిందిస్థాయి సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అతన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బైక్‌లు ఢీ..నలుగురికి గాయాలు

నందవరం : ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొట్టుకోవడంతో ఇరువురుకి గాయాలైన ఘటన మండల కేంద్ర నందవరం సమీపంలో కాలువ వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన అంజి, బాబు నందవరానికి పెళ్లి చూపులకు వచ్చి బైక్‌పై తిరుగుపయనమయ్యారు. అలాగే పెద్దకడబూరు మండలం కంబందహాల్ గ్రామానికి చెందిన బాలరాజు, మరొక బాలుడితో కలిసి నందవరం గ్రామానికి వసున్నారు. నందవరం- ముగతి ప్రధాన రహదారిలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదంలో బైక్‌పై ఉన్న నలుగురు స్వల్ప గాయాలతో పడ్డారు. గాయపడిన వ్యక్తులను స్థానికులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మరో ప్రమాదంలో ఇద్దరికి..

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కలుగోట్ల గ్రామం వద్ద బుధవారం సాయంత్రం రెండు స్కూటర్లు ఎదురెదుగా ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి.. ఆదోని మండలం పెసలబండ గ్రామానికి చెందిన రాఘవేంద్ర కలుగోట్ల నుంచి బైక్‌పై ఎమ్మిగనూరు వైపు వస్తుండగా ఎమ్మిగనూరు నుంచి టీఎస్ కూళ్లూరుకు వెళ్తున్న భీమన్న బైకు కలుగోట్ల సమీపంలో ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు స్కూటరిస్టులు రాఘవేంద్ర, భీమన్నలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు షూ పంపిణీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వైఎఫ్‌సీ ఫుట్‌బాల్ క్రీడాకారులకు స్థానిక కిరణ్ హైబ్రీడ్స్ అధినేత నాగరాజు బుధవారం ఫుట్‌బాల్ షూలను అందజేశారు. "ఫుట్‌బాల్ క్రీడల్లో ఎమ్మిగనూరు క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారని, భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ మాబుసాహెబ్, వైఎఫ్‌సీ కార్యదర్శి పాలశ్రీనివాసరెడ్డి, సీనియర్ క్రీడాకారులు ప్రసాద్, ఈరన్న, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు రూరల్: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న 1,152 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వివలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమాచారం మేరకు బుధవారం తెల్లవారు జామున 4 గంటలకు ఆలూరులోని కస్తూర్బా0 పాఠశాల సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. మొలగవల్లి గ్రామానికి చెందిన గోవిందు, నరసింహులు స్కూటర్లపై అక్రమంగా తరలిస్తున్న 12 బాక్సుల కర్ణాటక మద్యం (1,152 ఒరిజినల్ ఛాయిస్ 90 ఎంఎల్) స్వాధీనం చేసుకుని స్కూటర్‌లను సీజ్ చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఆలూరు ఎస్ఐ డాక్టర్ నాయక్, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఎరువులు, విత్తన విక్రయ దుకాణాల్లో బుధవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ సాయిరాం ట్రేడర్స్‌లో యుఎస్ 706, యుఎస్ 707 అనే రకం పత్తి విత్తన ప్యాకెట్ ఎంఆర్‌పీ రూ.853లు ఉండగా రూ 1,300 విక్రయిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. దాదాపు రూ. 1.20లక్షలు విలువ చేసే 120 ప్యాకెట్ల పత్తి విత్తన విక్రయాలు నిలిపివేశారు. అలాగే శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్‌లో పత్తి, ఆముద విత్తనాలను అధిక ధరలకు విక్రయించినట్లు గుర్తించి, అమ్మకాలు తాత్కాలికంగా నిలుపదల చేశామని విజిలెన్స్ సీఐ నాగరాజుయాదవ్ తెలిపారు. ఇన్‌చార్జ్ ఏవో స్రవంతి, విజిలెన్స్ అధికారులు చంద్రోశేఖర్, సిద్దయ్య తదితరులు ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

నందవరం: పల్లెల్లో బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ పిలుపునిచ్చారు. అలాగే గ్రామాల్లో నెలకొన్న నీటి, విద్యుత్ తదితర సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. గ్రామాలల్లో బాల్య వివాహాలపై అవగాహన కల్పించి ప్రజలలో చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం పలువురు ప్రజా ప్రతినిధులు వారి పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిత్యానందరాజు, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, పీఆర్ ఏఈ జయన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవమ్మ

వలంటీర్ల సేవలు ఎనలేనివి


వలంటీర్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: గ్రామాల్లో వలంటీర్లు అందిస్తున్న సేవలు ఎనలేనివని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కడిమెట్ల గ్రామ సచివాలయం వద్ద వలంటర్లీకు వందనం కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్ల కేశన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగదేవతా మూర్తుల పున:ప్రతిష్ఠ

వెల్దుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆధునీకరించిన నూతన నాగులకట్టన 54 నాగదేవతా మూర్తుల పున:ప్రతిష్ఠ బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సీఐ యుగంధర్, ఎస్ఐ చంద్రోశేఖర్ రెడ్డి, స్టేషన్ బృందం ఆధ్వర్యంలో మండల ప్రధాన పండితులు యార్లపాటి శ్రీధర్ శర్మ నేతృత్వంలో కార్యక్రమాలు జరిగాయి. అనంతరం సీఐ భక్తుల సమక్షంలో పూర్ణాహుతి ఇచ్చారు. యంత్ర ప్రతిష్ఠ, కలశ పూజలు చేపట్టిన వారిలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌ఛార్జ్ సమీర్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, ఆవుల వెంకటేశ్వర్లు, బొమ్మన శివశంకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, టీవీఎస్ రమేశ్, డాక్టర్ రాంప్రసాద్, సుబ్బారెడ్డి, పలువురు ప్రముఖులు ఉన్నారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు

తుగ్గలి : వెలకట్టలేని సేవలతో ప్రభుత్వానికి అండగా ఉంటూ సంక్షేమ వారధులుగా వలంటీర్లు నిలుస్తున్నారని సచివాయల కన్వీనర్ అమరనాథరెడ్డి అన్నారు. బుధవారం కడమకంట్లలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లను సేవా మిత్ర పురస్కారాలతో సత్కరించి ప్రశంసా పత్రాలు, బ్యాడ్జిలు, ప్రోత్సాహకం అందించారు. వలంటీర్లు ఇంకా బాగా పనిచేసి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఎల్లమ్మగుట్ట పంచాయతీ సర్పంచ్ గౌరవ సలహాదారు, సచివాయల కన్వీనర్ బాబునాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు లాలానాయక్, రామాంజినేయులు, రమేష్ పాల్గొన్నారు.


వలంటీర్లను సన్మానించిన దృశ్యం

అధికారులు సహకరించాలి

ఆలూరు/హాలహర్వి: గ్రామాల్లో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెర వేర్చేందుకు అధికారులు సహకరించాలని హాలహర్వి మండల ప్రజాప్రతినిధులు కోరారు. హామీలు అమలు చేయడంలో కాలయాపన చేయడాన్ని మండల స్థాయి అధికారులను తప్పపడుతూ మండిపడ్డారు. స్థానిక ఎంపీడీఓ సమావేశం హాలులో బుధవారం ఎంపీపీ నెట్టకంటమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొక్కెరచేడు, బేవినహాళ్, చింతకుంట అర్ధగేరి, ఎం.కే, పల్లి, టి.చాకిబండ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు బాషా, మన్మథ్‌రెడ్డి బసన్న, బాలరాజు, మల్లికార్జున తదితరులు మాట్లాడారు. తాగునీటి ఎద్దడి, విద్యుత్ సదుపాయం కూడా అధికారులు మెరుగు పరచకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఎంపీడీఓ ఆంటోని, జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప, వైఎస్ ఎంపీపీ నాగేష్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు రుణాలు

నందవరం: జగనన్న కాలనీలో గృహ నిర్మాణ లబ్ధి దారులకు ప్రభుత్వం రుణం మంజూరు చేస్తుందని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణలబ్ధిదారులు ఉప్పర పద్మావతి, ఉప్పర ఉరుకుందమ్మ, కురువ సిద్దమ్మలకు వైఎస్సార్ క్రాంతి పథం కింద రుణం మంజూరు చేశారు. ఏపీఎం చిన్న వీరన్న ఆధ్వర్యంలో ఎంపీడీఓ చెక్కును అందజేశారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

వెల్దుర్తి: మండల పరిధిలోనిబొమ్మిరెడ్డిపల్లె ఎబీఎం చర్చి 29వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పాస్టర్ రివరెండ్ టి ఎ దేవదాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సువార్త సేవకుడు చంద్రశేఖర్ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్టీబీసీ ట్రెజర్ డిగ్రీ కాలేజీ కరెస్పాండెంట్ ఆర్ఆర్‌డీ సజీవరాజు, స్టాంటన్‌పురం పాస్టర్ ఇమ్మానియేల్, బెనహర్, కర్నూలు సిటీ పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యెహోషువ, సోలమన్‌రాజు, జోనాథన్ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

పత్తికొండ రూరల్ : స్థానిక బస్టాండు సమీపంలో బుధవారం రాత్రి ట్రాక్టర్‌ను కారు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. హోసూరుకు చెందిన తమ మిత్రుడిని వదిలివచ్చేందుకు పత్తికొండకు చెందిన జగదీష్, జీడీ మధు, సద్దాం కారులో బయల్దేరి వెళ్లారు. తిరిగి వస్తుండగా బస్టాండ్ నుంచి బయటకు వస్తున్న ట్రాక్టర్‌ను కారు వేగంగా ఢీకొంది. దీంతో కారు దెబ్బతినగా తీవ్రంగా గాయపడిన జగదీష్‌ను చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ సద్దాం, జీడీ మధు స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

పెద్దహోతూరు సర్పంచ్ మృతి

ఆలూరు రూరల్: మండలంలోని పెద్దహోతూరు గ్రామ సర్పంచ్ లక్ష్మన్న (72) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రోజులగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కోలుకోలేక బుధవారం ఉదయం కన్నుమూశారన్నారు.

బీమా సాయం అందజేత

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని గాంధీనగర్ పరిధిలో చెద్దె వెంకటేష్ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. తక్షణ సహాయం కింద మంజూరైన వైఎస్ఆర్ బీమా సొమ్ము రూ.10వేలను మృతుడి భార్య అరుణకు వార్డు కౌన్సిలర్ డిష్‌కేశవరెడ్డి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు వెల్ఫేర్ సెక్రటరీ శిరీష, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మెలగాలి

ఆస్పరి: ప్రతి ఒక్కరూ ఆధ్మాత్మికతతో మెలిగితే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముత్తుకూరు గ్రామంలో సర్పంచ్ తోయజాక్షప్ప అధ్యక్షతన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మ ప్రచార కార్యక్రమాలు శుక్రవారం వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేణుగోపాల్, క్రిష్టారెడ్డి, చంద్రారెడ్డి, రామిరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ

నందవరం : ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ మర్రి స్రవంతి సూచించారు. బుధవారం స్థానిక ఆర్బీకేలో రైతులకు రాయితీ విత్తనాలు, ఎరువులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. మండలానికి 140 క్వింటాళ్ల జిలుగ, 36 క్వింటాళ్ల పిల్లి పెసర, 30 క్వింటాళ్ల వేరుశనగ, 3 క్వింటాళ్ల కందులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రభావతి, రైతులు పంపన్నగౌడ్, సరళ విజయన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు



పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ జి.కృష్ణకాంత్

పత్తికొండటౌన్: సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. మంగళవారం స్థానిక సెయింట్‌జోసెఫ్ ఉన్నతపాఠశాలలో ఏర్పాటు చేసిన సభాప్రాంగణం వద్ద బందోబస్తుకు వచ్చిన పోలీసు సిబ్బందికి సూచనలు ఇచ్చారు. హెలిప్యాడ్, సీఎం పర్యటించే రూట్, రూఫ్-టాప్ ప్రాంతాలలో సీఎం కాన్వాయ్, బహిరంగసభ సమావేశ ప్రాంగణం ప్రాంతాలలో విధులు నిర్వహించే స్పెషల్‌పార్టీ పోలీసు బృందాలు, పోలీసు జాగిలాలు, బాంబ్‌స్క్వాడ్ బృందాలతో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు. సభకు వచ్చే ప్రజల పట్ల సున్నితంగా వ్యవహరించాలన్నారు. అనంతరం సీఎం కాన్వాయ్ రిహార్సల్స్‌ను, హెలిప్యాడ్, బహిరంగసభ వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనతో కలసి ఎస్పీ పరిశీలించారు. నలుగురు అడిషనల్ ఎస్పీలు, 19 మంది డీఎస్పీలు, 57 మంది సీఐలు, 119 మంది ఎస్‌ఐలు, 473 మంది ఏఎస్‌ఐలు, 815 మంది పోలీసులు, 70 మంది మహిళా పోలీసులు, 396 మంది హోం గార్డులు, 2 సెక్షన్ల ఏఆర్ సిబ్బంది, 2 సెక్షన్ల స్పెషల్‌పార్టీ బృందాలను సీఎం పర్యటన బందోబస్తుకు కేటాయించినట్లు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. ఎస్పీ వెంట సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఈడీగా గిడుగు వెంకటేశ్వరరావు



కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణ శాఖ(ఆర్టీసీ) కడప జోన్(కర్నూలు, కడప, అనంతపురం ఉమ్మడి జిల్లాలు) ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా గిడుగు వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న గోపినాథ్‌రెడ్డిని విజయవాడకు బదిలీ చేయగా అక్కడున్న వెంకటేశ్వరరావును ఇక్కడికి స్థాన చలనం కలిగిస్తూ సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారాకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన 2015-17 మధ్య కర్నూలు రీజినల్ మేనేజర్‌గా విధులు నిర్వహించారు. అలాగే ఎమ్మిగనూరు డిపో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.నాగభూషణంను అనంతపురం జిల్లా కమర్షియల్ విభాగం ఏటీఎంగా బదిలీ చేయగా.. అక్కడున్న బి.అమర్నాథ్‌ను ఎమ్మిగనూరుకు బదిలీ చేశారు.

నేడు పత్తికొండకు సీఎం వైఎస్ జగన్

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- 1,500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు



సిద్ధమైన సభాప్రాంగణం

కర్నూలు(సెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పత్తికొండకు రానున్నారు. వరుసగా ఐదో ఏడాది వైఎస్ఆర్ రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. బటన్ నొక్కి రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి వైఎస్ఆర్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని, ఇన్‌పుట్ సబ్సిడీని జమ చేయనున్నారు. సీఎం పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పత్తికొండలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల ఆవరణలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. జూనియర్ కాలేజీ ఆవరణలో హెలిప్యాడ్‌ను తాత్కాలికంగా నిర్మించారు. పత్తికొండలో సీఎం పర్యటించే ప్రాంతాల్లో రహదారులను బాగు చేశారు. నిరంతరంగా విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం నాలుగు రోజుల క్రితమే సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం టూర్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ కూడా పత్తికొండలో ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు.

సీఎం పర్యటన సాగుతుంది ఇలా..

గురువారం ఉదయం 8.20 గంటలకు సీఎం ఇంటి నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

- 9.20 గంటలకు విమానంలో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు వస్తారు.
- 9.20 నుంచి 9.30 వరకు సీఎంతో ప్రజా ప్రతినిధులతో మాట్లాడే అవకాశం ఉంటుంది.
- 10 గంటలకు హెలికాప్టర్‌లో పత్తికొండలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10 నుంచి 10.10 గంటల మధ్య అక్కడ సీఎంకు ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలుకుతారు.
- 10.10 గంటలకు రోడ్డు మార్గన సభావేదికకు వెళ్తారు.
- 10.25 గంటలకు సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సభా వేదిక ప్రాంగణానికి సీఎం చేరుకుంటారు.
- 10.25 నుంచి 10.35 గంటల మధ్య ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం తిలకిస్తారు.
- 10.40 గంటలకు సభా వేదికపైకి సీఎం వస్తారు.
- 10.45 గంటల్లోపు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం ఉంటుంది.
- 10.45 నుంచి 10.50 గంటలకు కలెక్టర్ ప్రసంగిస్తారు.
- 10.50 నుంచి 10.55 గంటల వరకు స్థానిక ఎమ్మెల్యే మాట్లాడతారు.
- 10.55 నుంచి 11.05 గంటల మధ్య సభకు వచ్చిన మంత్రులు, ఇతరుల ప్రసంగిస్తారు.
- 11.05 గంటలకు రైతు భరోసా పెట్టుబడి నిధులపై షార్ట్ వీడియో ప్రదర్శన నిర్వహిస్తారు.
- 11.10 గంటలకు రైతు భరోసాతో లాభం పొందిన రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటారు.
- 11.15 నుంచి11.50 మధ్య సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం ఉంటుంది.
- 11.50 నుంచి 11.55 వరకు రైతు భరోసా నిధులను బటన్ నొక్కి అర్హుల జాబితాలో జమ చేస్తారు.
- 12.05 గంటలకు తిరిగి హెలిపాడ్ చేరుకుంటారు.
- 12.05 నుంచి 12.35 గంటల వరకు స్థానిక నాయకులతో మాట్లాడతారు.
- 12.40 గంటలకు హెలికాప్టర్‌లో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు.
- 01.05 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు చేరుకుంటారు.
- 01.10 గంటలకు ఓర్వకల్లు నుంచి విమానంలో గన్నవరం బయలుదేరుతారు.



సభా వేదికను పరిశీలిస్తున్న అధికారులు



ఏర్పాట్లపై కలెక్టర్‌తో చర్చిస్తున్న తలశిల రఘురాం

అమ్మా చనిపోతున్నా.. నా పిల్లలు జాగ్రత్త!



హుసేన్ పీరా (ఫైల్)

ఆదోని సెంట్రల్: మండల పరిధిలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన ఖాసీం పీరా(32) రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు ముందు తీసుకున్న సెల్ఫీ వీడియోలో ''అమ్మా చనిపోతున్నా.. నా పిల్లలు జాగ్రత్త' అని చెప్పడం అందరినీ కలచివేసింది. మృతుడు గతంలో పెద్ద తుంబళం ఎస్‌ఐ జీపు డ్రైవర్‌గా పనిచేశాడు. ప్రస్తుతం జీపు డ్రైవర్‌గా హోంగార్డును నియమించడంతో ఆరు నెలల నుంచి ఖాళీగా ఉంటున్నాడు. ఇతని భార్య ఖాజీబీ అలియాస్ ఫాతిమా అంగనవాడీ ఆయాగా పని చేస్తోంది. వీరి కుమార్తె అఫ్రీన్ ఐదో తరగతి, కుమారుడు అబ్బాస్ నాలుగో తరగతి చదువుతున్నారు. తీవ్రమైన కడుపునొప్పి భరించలేక జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామస్వామి తెలిపారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- నగర మేయర్ బివై.రామయ్య
- రూ.15.10 కోట్లతో నిర్మించిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ప్రారంభం
- హాజరైన కర్నూలు, నంద్యాల ఎంపీలు, కర్నూలు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు



ఫిల్టర్ బెడ్ ప్రారంభం, పనితీరును పరిశీలిస్తున్న మేయర్, కర్నూలు, నంద్యాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు

కర్నూలు (టౌన్): తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకున్నట్లు నగర మేయర్ బీవై రామయ్య తెలిపారు. గురువారం స్థానిక మునగాలపాడు పంప్ హౌస్ వద్ద రూ.15.10 కోట్లతో నిర్మించిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను కర్నూలు, నంద్యాల ఎంపీలు డాక్టర్ సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ జరదొడ్డి సుధాకర్, కమిషనర్ భార్గవ్‌తేజలతో కలిసి నగర మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాలంలోనే నగర వాసుల దప్పిక తీర్చేందుకు రూ.225 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఎంపీలు సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డిలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను నగరపాలక సంస్థ సమర్థవంతంగా వినియోగించుకుంటుందని కొనియాడారు. కర్నూలు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, డాక్టర్ జరదొడ్డి సుధాకర్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వం కర్నూలు నగరాన్ని పూర్తిగా విస్మరించడంతో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. వైఎస్ జగన్ సర్కార్ కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించి అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తోందన్నారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ నగరవాసుల తాగునీటి సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్లాంట్ పనులను పూర్తి చేశామన్నారు. సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు రూ.82 కోట్లతో నిర్మిస్తున్న పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మరో నాలుగు నెలల్లో వాటిని ప్రారంభిస్తామన్నారు.

నంద్యాల ఎంపీ ల్యాడ్స్ నిధులతో..

నంద్యాల ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ. 37.5 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన జేసీబీని పూజలతో ప్రారంభించారు. అనంతరం సుంకేసుల జలాశయం పరిశీలించారు. నీటి నిల్వల గురించి ఆరా తీశారు. అలాగే సుంకేసుల మునగాలపాడు పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఎకరన్నర స్థలంలో నిర్మించిన నీటి శుద్ధి కేంద్రం, ఆలమ్ ట్యాంకు, రసాయన హౌస్, బైపాస్ చానల్, ఏరేటర్‌లను అతిథులు ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, స్టాండింగ్ కమిటీ సభ్యులు వై.అరుణ, సాన శ్రీనివాసులు, మల్లికాబేగం, కార్పొరేటర్లు షాషావలీ, ఆర్షియా ఫర్హీన్, నీలోఫర్, జుబేర్, యూనుసు, ఫరాజ్‌ఖాన్, క్రాంతికుమార్, విజయలక్ష్మి, కై పా పద్మలతారెడ్డి, గాజుల శ్వేతారెడ్డి, సిట్రా సత్యనారయణమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మిద్దె చిట్టెమ్మ, సాంబశివరావు, విక్రమసింహారెడ్డి, మునెమ్మ, శ్రీనివాసరావు, క్రిష్ణకాంతారెడ్డి, అహ్మద్ హుస్సేన్, ఎస్ఈ వేణుగోపాల్, పబ్లిక్ హెల్త్ ఈఈ చంద్రమోహన్, ఎంఈలు శేషసాయి, షాకీర్ హుస్సేన్, డీఈఈ రవిప్రకాష్ నాయుడు, మేనేజర్ రచిన్నరాముడు పాల్గొన్నారు.



మునగాలపాడు పంప్ హౌస్ వద్ద నిర్మించిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మేయర్, కర్నూలు, నంద్యాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు



నిడ్జూరు వద్ద పైపులైన్ పనులను పరిశీలిస్తున్న మేయర్, ఎమ్మెల్యేలు

పాములపాడు విద్యార్థి ప్రతిభ



వర్షిత్

పాములపాడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం (ఐఐటీ, ఎన్ఐటీ, ఎన్ఈఈటీ) ప్రవేశ పరీక్షలో స్థానిక ఏపీ మోడల్ స్కూలు విద్యార్థి వర్షిత్ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడని ప్రిన్సిపాల్ నాగరవీంద్ర తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2023-24 విద్యాసంవత్సరం ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 3,000 మంది హాజరయ్యారన్నారు. విద్యార్థి వర్షిత్ 60 మార్కులకు గానూ 46 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించడం తమ స్కూల్‌కు గర్వకారణమన్నారు.

విలువ పెంపు.. రైతుకు ఊరడింపు

- భూమి విలువ పెరిగితే పొందే ప్రయోజనాలే అనేకం
- అనుకోని పరిస్థితుల్లో తనఖా పెట్టినా, అమ్మినా వచ్చే రేటు ఎక్కువే
- ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం భూములను కోల్పోతే ఎక్కువ పరిహారం చెల్లిస్తారు
- మార్కెట్ విలువ పెంచినా స్టాంప్ డ్యూటీ మాత్రం పెరగదు
- జిల్లాలో భూముల కనీస మార్కెట్ రేటు రూ.1.6 లక్షలు.. అత్యధికం రూ.20 లక్షలు
- వంద గ్రామాల్లో మార్కెట్ విలువను సవరించిన రిజిస్ట్రేషన్ శాఖ
- రేపటి నుంచి కొత్త మార్కెట్ విలువ ప్రకారమే రిజిస్ట్రేషన్లు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాలో 11 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో అతి తక్కువగా కోసిగిలో ఎకరం వ్యవసాయ భూమి మార్కెట్ విలువ రూ. 1.60 లక్షలు ఉండగా, అత్యధికంగా కర్నూలు, కల్లూరుతోపాటు అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల పరిధిలోని వ్యవసాయ భూముల విలువ దాదాపు రూ. 30 లక్షల వరకు ఉంటోంది. వ్యవసాయేతర భూముల విలువ అయితే ఎకరం రూ.కోటిన్నర వరకు మార్కెట్ విలువ ఉంటోంది. ఈక్రమంలో తక్కువ మార్కెట్ విలువ ఉన్న గ్రామాల్లో సవరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎకరం రూ. 2.5 లక్షల లోపు ఉన్న భూముల విలువను పెంచారు. వంద గ్రామాల్లో 10 నుంచి 35 శాతం వరకు పెంచారు. దీంతో ఆయా గ్రామాల్లో ఎకరం మార్కెట్ విలువ మూడు లక్షల వరకు చేరి ఉంటుంది.

అసత్య ప్రచారాలు..

రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ విలువల సవరణ చేపట్టడంతో కొంత దుష్ప్రచారం జరుగుతోంది. కేవలం ప్రభుత్వం విలువ పెంచుకొని సొమ్ము చేసుకోవడానికి చూస్తోందని ఆరోపణలు చేస్తున్నారు. అయితే అందులో ఎలాంటి నిజం లేదు. మార్కెట్ విలువను పెంచడంతో రైతన్నకు ఎన్నో లాభాలు ఉన్నాయి. మార్కెట్ విలువ ఎక్కువగా ఉంటే ఆ భూమి ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం తీసుకున్నా రైతులు అధిక ప్రయోజనం పొందవచ్చు. రైతుల నుంచి ప్రభుత్వం భూమి తీసుకుంటే 2013 భూసేకరణ చట్టం ప్రకారం మూడు రెట్లు అధికంగా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలో మార్కెట్ విలువ అధికంగా ఉంటే రైతన్నకే మేలు జరుగుతుంది. ఇబ్బందుల్లో అన్నదాత బ్యాంకులో తనఖాపెట్టిన మార్కెట్ విలువ ప్రకారం రేటు చెల్లిస్తారు. అప్పుడు కూడా రైతుకు మేలే జరుగుతుంది. ఒక వేళ అమ్ముకున్నా మార్కెట్ రేటు దృష్టిలో ఉంచుకొని విక్రయించడానికి అవకాశం ఉంటుంది.

స్టాంపు డ్యూటీ పెంపు లేదు..

ఆస్తుల క్రయ, విక్రయాల ప్రక్రియలో భాగంగా స్టాంపు డ్యూటీ కింద మార్కెట్ విలువలో 7.5 శాతం మొత్తాన్ని చలానా రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో 5.5 శాతం స్టాంపు డ్యూటీ, 1.5 శాతం ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, ఒక్క శాతం రిజిస్ట్రేషన్ ఫీజు ఉంటుంది. దీనికి అదనంగా యూజర్ చార్జీని రూ.500 వసూలు చేస్తారు. అయితే భూముల మార్కెట్ విలువ పెంచినా ప్రభుత్వం మాత్రం స్టాంపు డ్యూటీని పెంచలేదు. అయితే భూముల విలువ కొంత మేరకు పెరిగితే స్టాంపు డ్యూటీ కూడా కొంత పెరుగుతుంది.

- కర్నూలు నగరానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉల్చాలలో ఎకరా విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఉంది. అయితే మార్కెట్ విలువ మాత్రం రూ. 4 లక్షలు మాత్రమే ఉంది. ఇటీవల ఆ గ్రామానికి చెందిన రైతుల పొలాలు చెన్నై - సూరత్ జాతీయ రహదారి కోసం ప్రభుత్వం సేకరించింది. మార్కెట్ విలువ ప్రకారం రెండు రెట్లు అదనంగా ఇచ్చినా రూ. 12.50 లక్షలు మాత్రమే ఇచ్చింది. అయితే రైతులు ఇది చాలా తక్కువ పరిహారమని, తమ పొలాలు బహిరంగ మార్కెట్‌లో కోట్లలో విలువ చేస్తాయని వాదించినా ఏమి చేయలేని పరిస్థితి. అదే అక్కడ మార్కెట్ విలువ ఎక్కువగా ఉంటే వారికి ఎక్కువ పరిహారం వచ్చేది.
- మార్కెట్ విలువ ఎక్కువగా ఉంటే రైతులు పొందే పరిహారాలు ఎక్కువగా ఉంటాయి. తక్కువగా ఉంటే ప్రస్తుత పరిస్థితుల్లో అన్నదాతలు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకొని మార్కెట్ విలువ తక్కువగా ఉన్న గ్రామాల్లో సవరణ చేసింది. జిల్లాలో దాదాపు 100 గ్రామాల్లో మార్కెట్ విలువను 10 నుంచి 35 శాతం పెంచారు.



జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం

నేటి నుంచి పెరిగిన మార్కెట్ విలువ ప్రకారమే రిజిస్ట్రేషన్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి పెరిగిన మార్కెట్ విలువల ప్రకారమే సబ్ రిజిస్ట్రార్లు విక్రయ దరఖాస్తులను పూర్తి చేస్తారు. కర్నూలు జిల్లాలో 100 గ్రామాల్లో మార్కెట్ విలువను పెంచారు. పెంచిన విలువలను ఆన్‌లైన్ ప్రక్రియలో నమోదు చేశారు. ఇందుకోసం జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని ప్రజలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగమయ్యే ప్రజలు గమనించాలని అధికారులు కోరుతున్నారు.

పెరిగిన విలువతోనే రిజిస్ట్రేషన్‌లు



జూన్ 1 నుంచి పెరిగిన మార్కెట్ విలువ ప్రకారమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ నడుస్తుంది. ఇప్పటికే జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తెలిపింది. ప్రజలు గమనించాలని కోరుతున్నాం. స్టాంపుడ్యూటీ మాత్రం పెరగలేదు. భూమి విలువ పెరిగితే రైతన్నకే అన్ని రకాలుగా మేలు జరుగుతుంది.

– నాగలింగేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రార్, కర్నూలు

సాక్షి
కర్నూలు
గురువారం । 1 । జూన్ । 2023




వెండి ధమరుకం విరాళం

మహానంది: యూఎస్‌ఏలో ఉంటున్న కందిమళ్ల కిరణ్‌కుమార్, శిరీష దంపతులు వెండి ధమరుకాన్ని మహానందీశ్వరస్వామికి బుధవారం విరాళం ఇచ్చినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన శృతికిరణ్ నృత్యాంజలి స్కూల్ వారు చేసిన సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను అలరించింది.



పల్లె రోడ్లకు మహర్దశ

జిల్లాలోని పల్లె రోడ్లకు మహర్దశ రానుంది. ఏపీఆర్ఆర్‌పీ పనుల్లో భాగంగా ఏడు నియోజకవర్గాల్లో రూ.189.11 కోట్లతో 85 పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 8లో

న్యూస్‌రీల్

మంత్రాలయం భక్తుల కోసం ప్రత్యేక రైలు

ఆదోని సెంట్రల్: గుంతకల్లు నుంచి ఆదోని మీదుగా మంత్రాలయం వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు ఆదోని రైల్వే స్టేషన్ మాస్టర్ ఎస్. వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైన్ నంబర్ 07411 గుంతకల్లులో ప్రతి రోజూ సాయంకాలం 5.40 గంటలకు బయలు దేరి తుంగభద్ర రైల్వేస్టేషన్‌కు సాయంత్రం 6.20 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. తుంగభద్ర రైల్వేస్టేషన్‌లో 07412 నంబరుగల రైలు ఉదయం 4.40 గంటలకు బయలు దేరి ఉదయం 5.20 గంటలకు గుంతకల్లుకు చేరుకుంటుందని తెలిపారు.

ఇమామ్‌లు వివరాలు ఇవ్వాలి

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇమామ్, మౌజన్ పథకం అమలు కోసం ముతవల్లులు/ సంబంధిత మసీదు కమిటీ అధ్యక్షులు తమ వివరాలు సమర్పించాలని కర్నూలు జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పథకం వర్తింపజేసేందుకు మసీదు పేరుతో బ్యాంక్ అకౌంట్, అధ్యక్షుడి పాన్ కార్డు, ముతవల్లి పాన్ కార్డు, ఇమామ్ ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్, మౌజన్ ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరార్స్ కాపీలన్నీ కలర్‌లో తెచ్చివాలని పేర్కొన్నారు.

పీజీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. రెగ్యులర్ పరీక్షలు 521 మంది రాయగా 482 మంది, సప్లిమెంటరీ పరీక్షలు 214 మంది రాయగా 163 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. పరీక్ష ఫలితాలను వెబ్‌సైట్ http://rayalaseemauniversity.ac.in/లో చూడాలని తెలిపారు.



- ఖరీఫ్ సీజన్‌కు ముందే అందుతున్న పెట్టుబడి సాయం
- ఐదో ఏటా రైతు భరోసా పథకం అమలుకు చర్యలు
- నేడు పత్తికొండలో కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- ఈ ఏడాది మొదటి విడతలో 2,83,308 మంది రైతులకు లబ్ధి
- గతేడాదితో పోలిస్తే అదనంగా పెరిగిన రైతులు 4,461 మంది

రాజకీయ కోణం నుంచి ఆలోచించే ప్రభుత్వాలను చూసి ఉంటాం.. అరుదుగా మాత్రమే మానవీయ కోణంలో ఆలోచించే ప్రభుత్వాలు కనిపిస్తాయి. ఈ కోవకు చెందినదే రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. రైతు బాగుంటే రాజ్యం బాగుంటుందని నమ్మి వారికి అండగా నిలుస్తోంది. ప్రతి ఏటా క్రమం తప్పకుండా రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తోంది. సీజన్‌కు ముందుగానే అన్నదాతలకు పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. ఐదో ఏడాది పత్తికొండ పట్టణం వేదికగా ఈ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు ప్రారంభించనున్నారు.



అన్నదాతకు పెట్టుబడి భరోసా

కర్నూలు(అగ్రికల్చర్): రుణమాఫీ పేరుతో ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కి 2014–15 నుంచి 2018–19 వరకు రైతులను టీడీపీ ప్రభుత్వం మోసం చేస్తే, ఇచ్చిన హామీకి మించి రైతుభరోసా ద్వారా వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అన్నదాతకు దన్నుగా నిలుస్తోంది. టీడీపీ ప్రభుత్వానికి, వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వానికి తేడా స్పష్టంగా తెలుస్తోంది. నాలుగేళ్లపాటు ఏడాదికి రూ. 12,500 చొప్పున రైతులకు పెట్టుబడి సాయం ఇస్తామని వైఎస్ఆర్‌సీపీ మేనిఫెస్టోలో ప్రకటించి, ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చెప్పిన దానికంటే మిన్నగా ఐదేళ్లపాటు ఏడాదికి రూ.13,500 ఇస్తామని ప్రకటించి, అమలు చేస్తోంది. ఇప్పటి వరకు నాలుగేళ్లుగా వైఎస్ఆర్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయాన్ని అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసింది. తాజాగా ఐదో ఏడాదికి సంబంధించి మొదటి విడత పెట్టుబడి సాయాన్ని రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదల చేసే కార్యక్రమాన్ని ఈ నెల 1న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పత్తికొండలో ప్రారంభించనున్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం విడుదల అవుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మొదటి విడతలో 2,83,308 రైతు కుటుంబాలకు సాయం

వైఎస్ఆర్ రైతు భరోసా కింద 5వ ఏడాదికి సంబంధించి మొదటి విడతలో జిల్లాలో 2,83,308 రైతు కుటుంబాలకు పెట్టుబడి సాయం విడుదల కానుంది. వైఎస్ఆర్ రైతుభరోసా-పీఎం కిసాన్ కింద మొత్తం రూ.13500 రైతులకు చెల్లిస్తుండగా... ఇందులో మొదటి విడతలో రూ.5,500 ప్రభుత్వం నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకే జమ చేస్తోంది. జిల్లాలోని 2,83,308 మంది రైతులకు రూ.155.82 కోట్లు జమ కానున్నాయి. మొదటి విడతలో పెట్టుబడి సాయం అందేవారిలో ముగ్గురు మినహా మిగిలిన వారంత భూ యజమానులే. ఆర్‌వోఎఫ్ఆర్ కింద అటవీ భూములను సాగు చేసుకుంటున్న ముగ్గురికి మాత్రం రూ.7,500 ప్రకారం విడుదల కానుంది. ఐదో ఏడాదికి సంబంధించి మొదటి విడత నేడు విడుదల చేస్తుండగా... రెండో విడత రబీ సీజన్ అవసరాల కోసం అక్టోబరు, మూడో విడత ధాన్యం ఇంటికి చేరే వేళ జనవరి నెలలో విడుదల చేయనున్నారు. రెండు, మూడో విడతలో కౌలుదారులు, ఆర్‌వోఎఫ్ఆర్ రైతుల(అటవీ భూములు అనుభవిస్తున్నవారు), దేవదాయ భూములు అనుభవిస్తున్న వారికి రాష్ట్రప్రభుత్వమే పూర్తిగా రూ.13500 చెల్లిస్తోంది.

పెట్టుబడి కష్టాలు లేకుండా...

గతంలో ఖరీఫ్ సీజన్ వస్తుందంటే రైతులను పెట్టుబడి కష్టాలు వెంటాడేవి. టీడీపీ హయాంలో బ్యాంకులు పంట రుణాలు సక్రమంగా ఇచ్చేవి కాదు. దీంతో రైతులు బంగారం ఆభరణాలు, చివరికి పుస్తెలు కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి పంటలు సాగు చేసే వారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు రుణమాఫీని ప్రకటించి చేతులెత్తేశారు. ఇది రైతులను మరింత అప్పుల ఊబిలోకి నెట్టింది. రైతులు పెట్టుబడులకు ఎటువంటి ఇబ్బంది పడరాదనే ఉద్దేశంతో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే వైఎస్ఆర్ రైతుభరోసా కింద పెట్టుబడిసాయాన్ని అందిస్తోంది.

ఐదేళ్లలో రూ.1608.08 కోట్ల సాయం

ఏడాదికేడాదికి వైఎస్ఆర్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయం పొందుతున్న రైతుల సంఖ్య పెరుగుతోంది. 2019–20లో పెట్టుబడి సాయం పొందిన రైతులు 2,59,123 ఉన్నారు. మొదటి ఏడాదితో పోలిస్తే ఐదో ఏడాదిలో లబ్ధిదారుల సంఖ్య 24,195 పెరిగింది. గతేడాది పోలిస్తే ఈ ఏడాది 4,461 మంది అదనంగా లబ్ధి పొందుతున్నారు. రెండు, మూడో విడతల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. మొత్తం ఐదేళ్లలో జిల్లాలో రూ.1,608.08 కోట్ల ప్రయోజనం పొందినట్లు అవుతోంది.

ఐదేళ్లలో పెట్టుబడిసాయం పొందిన జిల్లా రైతుల వివరాలు

సంవత్సరం	లబ్ధిపొందిన రైతులు	అందిన పెట్టుబడిసాయం (రూ. కోట్లలో)
2019 - 20	2,59,123	349.81
2020 - 21	2,70,974	365.31
2021 - 22	2,66,820	360.20
2022 - 23	2,78,847	376.44
2023 - 24 (మొదటి విడత)	2,83,308	155.82

నియోజకవర్గాల వారీగా పెట్టుబడిసాయం వివరాలు

నియోజకవర్గం	రైతులు	పెట్టుబడిసాయం (రూ. కోట్లలో)
కోడుమూరు	37,318	20.52
ఎమ్మిగనూరు	39,200	21.56
మంత్రాలయం	43,247	23.79
ఆదోని	19,036	10.48
పత్తికొండ	57,237	31.48
పాణ్యం (కల్లూరు,ఓర్వకల్)	21,217	11.66
ఆలూరు	66,053	36.32
మొత్తం	2,83,308	155.81

నేడు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

ఈ ఏడాది మార్చి నుంచి మే వరకు కురిసిన అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదల చేయనున్నారు. జిల్లాలో అకాల వర్షాలతో 574 మంది రైతులకు సంబంధించి 396.63 హెక్టార్లలో 33 శాతం పైగా పంటలు దెబ్బతిన్నాయి. నష్టపోయిన రైతులకు రూ.48.16 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీ కింద విడుదల చేయనున్నారు. వ్యవసాయ పంటలకు సంబంధించి 531 మంది రైతులు 370.62 హెక్టార్లలో పంటలను కోల్పోయారు. వీరికి రూ.43.94 లక్షలు, ఉద్యాన పంటలకు సంబంధించి 43 మంది రైతులు 26.01 హెక్టార్లలో పంటలను కోల్పోగా రూ.4.22 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కానుంది.

ఎరువుల దుకాణాలపై విజి'లెన్స్'


ఎమ్మిగనూరులోని దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు (టౌన్): విత్తనాలు, ఎరువుల దుకాణాలపై గురువారం జిల్లా వ్యాప్తంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడులు నిర్వహించారు. ఎమ్మిగనూరు పట్టణంలోని శ్రీసాయిరాం ట్రేడర్స్‌లో యు 706 ఏ అనే పత్తి రకం ఎంఆర్‌పీ రూ. 850 కాగా ఒక ప్యాకెట్ రూ.1300 లకు అమ్ముతున్నట్లు గుర్తించారు. దీంతో రూ. 1,20,000 విలువ చేసే 120 ప్యాకెట్లను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. అన్నపూర్ణ ట్రేడర్స్, వెంకటేశ్వర ట్రేడర్స్‌లు అనుమతి పత్రాలు సమర్పించకపోవడంతో రూ. 2 లక్షలు విలువ చేసే పత్తి విత్తనాలు, ఆముదం విత్తనాల విక్రయాలను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు విజిలెన్స్ ఆఫీసర్ వెల్లడించారు. దాడుల్లో సీఐలు కేశవరెడ్డి, నాగరాజు యాదవ్, సుధీర్‌కుమార్, చంద్రశేఖర్, సిద్దయ్య, రూపస్ పాల్గొన్నారు.





వెల్దుర్తి మండలం ఎస్.పేరేముల రోడ్డు

పల్లె రోడ్లకు మహర్దశ

- రూ.189.11 కోట్లతో పనులు

కర్నూలు(అర్బన్): ఎలాంటి రహదారి సౌకర్యం లేని గ్రామాలకు రోడ్లను వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోంది. ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్టు (ఏపీఆర్ఆర్‌పీ) పనుల్లో భాగంగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో రూ.189.11 కోట్ల నిధులతో ఆరు ప్యాకేజీల్లో 85 పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే ఆయా నియోజకవర్గాల్లోని 95 గ్రామాలకు సమీప గ్రామాలు, జాతీయ రహదారులకు కనెక్టివిటీ లభిస్తుంది. ఇప్పటికే ఈ పనుల్లో 18 పనులు పూర్తి కాగా, 66 పనులు పురోగతిలో ఉన్నాయి. ఆలూరు నియోజకవర్గంలో 44 పనులు చేపట్టగా, పత్తికొండ నియోజకవర్గంలో 21 పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు సంబంధించి మొత్తం 190.11 కిలోమీటర్ల మేర కొత్తగా రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఇందులో ఇప్పటి వరకు రూ.42.58 కోట్లు వెచ్చించి 17.94 కిలోమీటర్ల మేర బీటీ, 25.01 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల పనులు పూర్తయ్యాయి. అలాగే పీఎంజీఎస్‌వై – 3 కింద రూ.32.01 కోట్లతో మంజూరైన 8 రోడ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. పీఎంజీఎస్‌వై ఇన్సెంటివ్ గ్రాంట్ కింద రూ.3.67 కోట్లతో ఆరు రోడ్ల పనులను చేపట్టగా, ఇప్పటి వరకు ఐదు పనులు పూర్తి కాగా, ఒక్క పని పురోగతిలో ఉంది. ఈ పనుల్లో భాగంగా పాట్‌హోల్ ఫ్రీ లింక్ రోడ్స్ పనులకు సంబంధించి రూ.24.45 కోట్లతో 209.30 కిలోమీటర్ల మేర 56 పనులు మంజూరయ్యాయి. ఇందులో 24 పనులు పూర్తి కాగా, 32 రోడ్లలో పనులు జరుగుతున్నాయి.


7వ జాతీయ రహదారికి కనెక్టివిటీగా ఏర్పాటు చేసిన గుంటుపల్లె రోడ్డు

క్లుప్తంగా

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న బిషప్ ఎగ్గోని పుష్పలలిత

పగిడ్యాల: చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నంద్యాల డయాసిస్ ది రైట్ రెవ బిషప్ ఎగ్గోని పుష్పలలిత క్రైస్తవులకు సూచించారు. బుధవారం మండలంలోని కొత్త ముచ్చుమర్రి గ్రామంలో జరిగిన సీఎస్ఐ చర్చి వార్షికోత్సవంలో ఆమె మాట్లాడారు. అందరి పట్ల ప్రేమ, దయతో ఉండాలన్నదే ప్రభువు ఉద్దేశమన్నారు. చెడు కార్యాలు తలపెట్టి దేవుని కోపానికి గురికావద్దన్నారు. అనంతరం సంఘ పెద్దలు బిషప్‌ను గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో పాస్టర్ చల్లా స్టీఫెన్ బాబు, సంఘం పెద్దలు రాజరత్నం, త్యాగరాజు, మలిరెడ్డి యేసన్న, సగినేల వెంకటేశ్వర్లు, స్వామిదాసు, ఆర్గనైజర్లు బొల్లవరం ప్రసాద్, యోహాన్, మునిస్వామి, విజయరాజ్, చెన్నయ్య పాల్గొన్నారు.

చిరుత దాడిలో మేక మృతి


చిరుత దాడిలో మృతి చెందిన మేక

ఆస్పరి: మండలంలోని కలపరి గ్రామ సమీపంలోని గంగమ్మవ్వ కొండల్లో బుధవారం చిరుత దాడి చేసిన ఘటనలో ఒక మేక మృతి చెందింది. దీంతో కలపరి, తొగలుగల్లు, దొడగొండ, యాటకల్లు గ్రామస్తులు భయాందోళనలు చెందుతన్నారు. మేకలు మేపేందుకు కలపరి గ్రామానికి చెందిన చిన్న రంగన్న గంగమ్మవ్వ కొండకు వెళ్లాడు. కొండల్లో ఉన్న చిరుత మేకపై దాడి చేయడంతో చిన్న రంగన్న కేకలు వేసుకుంటూ భయంతో కలపరి గ్రామానికి వెళ్లాడు. గ్రామ సమీపంలో కొండ ఉండడంతో గ్రామస్తులు అరుపులు, కేకలు వేసుకుంటూ రావడంతో చిరుత మేకను వదిలి పారిపోయిందని కలపరి గ్రామస్తులు చెబుతున్నారు. ఫారెస్టు అధికారులు చిరుత నుంచి తమను కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలకు కోరుతున్నారు.

రహదారులను త్వరగా పూర్తి చేయండి

- ఆర్అండ్‌బీ జిల్లా ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి

నంద్యాల(రూరల్): జిల్లా పరిధిలో పెండింగ్‌లో ఉన్న రహదారులను త్వరగా పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ జిల్లా ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి డీఈలకు తెలియజేశారు. బుధవారం స్థానిక జిల్లా కార్యాలయంలో జిల్లాలోని డీఈలతో ఎస్ఈ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల సమన్వయంతో నూతన రహదారులు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రహదారుల పనుల్లో నాణ్యత తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. వర్షాల వల్ల దెబ్బతిన్న రహదారులను గుర్తించి నివేదిక పంపించాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

జూపాడుబంగ్లా: మండల కేంద్రానికి చెందిన జంగాల డోన్ పెద్దన్న (55) బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్తుల వివరాల మేరకు.. కుటుంబ కలహాల వల్ల మనస్తాపానికి గురైన డోన్ పెద్దన్న ఇంటికి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మృతునికి భార్య వెంకటమ్మ ఇద్దరు కుమారులు ఉన్నారు.

రేపటి నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తిచేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ జిల్లాలో 11,449 మంది విద్యార్థులకు 47 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు ఉంటాయని విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 47 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 47 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లతో పాటు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లతో పాటు 468 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. సందేహాల నివృత్తి కోసం డీఈఓ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామన్నారు.

4న కురువ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతిభావంతులైన కురువ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ఈ నెల 4వ తేదీన ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు జిల్లా కురువ సంఘం గౌరవాధ్యక్షులు కే కిష్టన్న, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికే ఎంపిక చేసిన 10వ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ బహుమతులను అందించనున్నట్లు చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలోని మండల పరిషత్ సమావేశ భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కురువ సంఘం నేతలు, మండల కమిటీల సభ్యులు, ప్రజలు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, ఉపాధ్యక్షులు కత్తి శంకర్, నాయకులు ఉరుకుంద, బి వెంకటేశ్వర్లు, బీసీ తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు సురక్షిత నీటిని సరఫరా చేయండి

- పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వద్దు
- ప్రాధాన్యత భవనాల లక్ష్యాన్ని చేరుకోవాలి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఉపాధి హామీ తదితర పనుల ప్రగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరమ్మతులకు గురైన సమగ్ర రక్షిత తాగునీటి పథకాలు, పైపులైన్లు, బోర్లకు వెంటనే రిపేర్లు చేయించాలన్నారు. జల జీవన్ మిషన్ కింద ప్రారంభించిన ఇంటింటికి కుళాయి కనెక్షన్ పనుల్లో ప్రగతి కనపడాలన్నారు. నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇంటింటికి కుళాయి కనెక్షన్ నిమిత్తం టెండర్లను పిలిచి పనులు ప్రారంభించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 116 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మరమ్మతులకు గురైన 536 సోక్ పిట్లను మూడు రోజుల్లో పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద రోజువారి లేబర్ రిపోర్టింగ్ శాతాన్ని పెంచాలన్నారు. ఏప్రిల్, మే మాసాలకు పెండింగ్‌లో ఉన్న 77 వేల పని దినాలు పూర్తి చేయాలని, అమృత్ సరోవర్ కింద చెరువుల పునరుద్ధరణ పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రాధాన్యత భవనాల నిర్మాణాలకు సంబంధించి కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, డీపీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అఖిలప్రియవి దిగజారుడు రాజకీయాలు

- చున్నీ లాగానని కేసు పెట్టడం బాధ కలిగించింది
- తల్లీదండ్రి రాజకీయ వారసత్వం తీసుకున్నప్పుడు వారి అప్పులు కూడా తీర్చాల్సిన బాధ్యత లేదా?
- ఏవీ సుబ్బారెడ్డి


మాట్లాడుతున్న ఏవీ సుబ్బారెడ్డి

నంద్యాల: మాజీ మంత్రి భూమా అఖిలప్రియవి దిగజారుడు రాజకీయాలని సీడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆమె తనపై చున్నీలాగానని కేసు పెట్టడం బాధ కలిగించిందన్నారు. పట్టణంలోని సిటీ కేబుల్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కొత్తపల్లె గ్రామం వద్ద జరిగిన ఘటనలో తండ్రి లాంటి వయసు ఉన్న తనపై చున్నీ లాగి, హత్యాయత్నం చేసినట్లు అఖిలప్రియ కేసు పెట్టడం మహిళా సమాజం సిగ్గుపడేలా ఉందన్నారు. ఇలాంటి ఆరోపణల వల్ల ఇద్దరి పరువు పోతుందని, కేసు పెట్టాలంటే ఎన్నో రకాల కారణాలు ఉంటాయని, మరీ ఇంత దిగజారడం ఏమిటని ప్రశ్నించారు. అఖిలప్రియ విధానాల వల్ల ఆమె కుటుంబ సభ్యులే దూరమవుతున్నారన్నారు. ఆళ్లగడ్డలో భూమా వర్గాన్ని, టీడీపీ కార్యకర్తలను దూరం చేసుకుందన్నారు. తనపై తప్పుడు ఫిర్యాదు చేయడంతోనే పోలీసులు తనను అరెస్టు చేయలేదన్నారు. పలుచోట్ల అక్రమాలకు, భూ కబ్జాలకు పాల్పడటంతోనే అఖిలప్రియను జైలుకు వెళ్లాల్సి వచ్చిందని, ఇందులోనూ తన ప్రమేయం ఏమీ లేదన్నారు. అప్పు చెల్లించాలని బంధువులే ఇంటి ముందు నిరసన వ్యక్తం చేశారని, తల్లి, తండ్రి నుంచి రాజకీయ వారసత్వం ఆశించినప్పుడు వారి అప్పులు కూడా కట్టాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే రాబోయే ఎన్నికల్లో ఆళ్లగడ్డ, నంద్యాలలో ఎక్కడి నుంచి అయినా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు.

రూ.80 లక్షలతో మహానంది కోనేర్లకు మరమ్మతులు


ధర్మకర్తల మండలి సమావేశంలో చర్చిస్తున్న చైర్మన్, ఈఓలు

మహానంది: మహానంది క్షేత్ర పరిధిలోని కోనేర్ల మరమ్మతులను రూ.80 లక్షలు ఖర్చు చేయనున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. చైర్మన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ధర్మకర్తల మండలి సమావేశంలో వారు మాట్లాడుతూ దేవస్థానం ఆధ్వర్యంలో రూ.40 లక్షలు, సీజీఎఫ్ నుంచి రూ.40 లక్షల మొత్తం రూ. 80 లక్షలతో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. బళ్లారి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి కుమారుడు, ప్రస్తుత ఎమ్మెల్యే భరత్‌రెడ్డిల ఆధ్వర్యంలో 70 కిలోల వెండితో మహానందీశ్వరస్వామి గర్భాలయానికి మహాద్వారం చేయించనున్నట్లు తెలిపారు. సుమారు రూ.60 లక్షలకు పైగా వెచ్చించేందుకు దాతలు ముందుకు వచ్చినట్లు చెప్పారు. నంద్యాలలోని డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ భార్గవవర్ధన్‌రెడ్డిల సహకారంతో భక్తుల సౌకర్యార్థం బస్‌షెల్టర్ నిర్మించనున్నామన్నారు. టీటీడీ నిధులు రూ.4.60 కోట్లతో చేపడుతున్న వసతిగదుల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఆలయంలోని క్యూలైన్లను ఆధునికీకరించనున్నట్లు వివరించారు. ఏప్రిల్ మాసానికి సంబంధించిన జమా, ఖర్చులు, ఇటీవల గిరిజనులకు గోవులను పంపిణీ చేసిన అంశాలపై చర్చించారు. టెండర్ల ఆమోదానికి సంబంధించి మాట్లాడారు. సమావేశంలో ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ధర్మకర్తలు గంగిశెట్టి మల్లికార్జున, బుసకాని వెంకటేశ్వర్లు, వీరభద్రుడు, బండి హేమలత, తపిల లక్ష్మీదేవి, ఏఈఓ వై.మధు, సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పండుగ

- జిల్లాలో 2,15,669 మంది లబ్ధిదారులు
- ఇంటింటికి వెళ్లి పింఛన్ అందజేయనున్న వలంటీర్లు


వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్(ఫైల్)

నందికొట్కూరు: ప్రభుత్వమంటే అధికారం చెలాయించడం కాదు.. ఓట్లేసి గెలిపించిన ప్రజల బాగోగులు చూడటం. నిత్యం ప్రజల సంక్షేమం కోసం పరితపించడం. అధికారంలో ఉన్నన్నాళ్లూ ప్రజల అభ్యున్నతికి పాటు పడటం. రాష్ట్రంలో అదే జరుగుతోంది. 2019 ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్ని ఆర్థిక సమస్యలున్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నెలనెలా సామాజిక పింఛన్లు అందిస్తూ వస్తున్నారు. అందులో భాగంగా గురువారం నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,15,669 మంది పింఛన్‌దారులకు ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్మును వలంటీర్లు అందజేయనున్నారు. తెలవారక ముందే గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొననుంది.

ఒకరికి తీసేస్తే కానీ మరొకరికి పింఛన్ వచ్చేది కాదు..

గత టీడీపీ పాలనలో పింఛను మంజూరు కావాలంటే ఓ ప్రహసనంలా ఉండేది. పరిమితి సంఖ్యలో మంజూరు చేయడంతో అధికశాతం పేదలు పింఛన్లు పొందేవారు కాదు. కొత్తగా ఒకరికి పింఛన్ రావాలంటే ఉన్నవారిలో నుంచి ఒకరికి తీసేసేవారు. లేదంటే ఎవరైనా మరణిస్తేనే మరొకరికి పింఛన్ మంజూరు చేసేవారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు మంజూరవుతున్నాయి. వృద్ధులకు, వితంతువులకు రూ.2,750, వికలాంగులకు రూ.3,000 చొప్పున ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే వలంటీర్లు ఇళ్ల వద్దకే వచ్చి అందజేస్తున్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

నంద్యాల(న్యూటౌన్): పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2,14,938 మంది పింఛన్‌దారులకు రూ.59,32,11,750 నగదు మంజూరైందన్నారు. వలంటీర్లు తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓలు పర్యవేక్షించాలన్నారు.

జగనన్న కన్న కొడుకులా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి పేదలకు కన్న కొడుకులా అండగా నిలిచాడు. ఒకటో తేదీన తెల్లవారుజామున ఇంటి తలుపులు తట్టి వలంటీర్ పింఛను ఇస్తున్నాడు. గతంలో పంచాయతీ కార్యాలయం, పోస్టాఫీసుల చుట్టూ తిరిగినా పింఛను ఇచ్చేవారు కాదు.

– మలిరెడ్డి ఎర్రన్న, జి.వీరాపురం గ్రామం, కొత్తపల్లి మండలం

తెల్లవారుజామునే పింఛను ఇస్తున్నారు



తెల్లవారుజామునే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నాడు. మూడేళ్ల నుంచి ఎప్పుడూ పింఛను ఆపలేదు. మాలాంటి నిరుపేదలకు పింఛను పథకం ఓ వరంలా మారింది.

– ఆరే.లక్ష్మమ్మ శాతనకోట గ్రామం, నందికొట్కూరు మండలం